క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ



శివను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి తదితరులు

మామిడికుదురు: మాతృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ యూత్ విభాగం మండల అధ్యక్షుడు మట్టపర్తి శివను పి.గన్నవరం నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలు గురువారం పరామర్శించారు. శివ తల్లి సత్యనారాయణమ్మ ఇటీవల మరణించారు. ఆమె చిత్రపటం వద్ద మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యనారాయణమ్మ మృతికి సంతాపం తెలిపారు. శివతో పాటు, అతని సోదరులను ఓదార్చారు. పరామర్శించిన వారిలో పార్టీ నేతలు తోరం భాస్కర్, కటకంశెట్టి ఆదిత్య, పాముల దేవీప్రకాష్, పాలమూరి గోపాల్, చిక్కం బుజ్జిబాబు తదితరులు ఉన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్ఏజే జిల్లా మీడియా కన్వీనర్‌గా రాజు



ఆలమూరు: నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఎన్‌హెచ్‌ఆర్ఏజే) జిల్లా మీడియా కన్వీనర్‌గా జీవీ రాజు నియమితులయ్యారు. రామచంద్రపురంలో ఇటీవల జరిగిన ఎన్‌హెచ్‌ఆర్ఏజే జిల్లా స్థాయి సమావేశంలో ఆలమూరు మండలంలోని పినపళ్లకు చెందిన రాజును సహచర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రజా హక్కుల పరిరక్షణకు, పేదలకు సత్వర న్యాయం అందేందుకు కృషి చేస్తానని రాజు తెలిపారు.

మెకానిక్‌లకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి



కేక్ కట్ చేస్తున్న మెకానిక్‌లు

అంబాజీపేట: మోటారు సైకిల్ మెకానిక్‌ల సంక్షేమానికి ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని పలువురు మెకానిక్‌లు కోరారు. స్థానిక నాలుగు రోడ్ల సెంటర్‌లో శ్రీలక్ష్మీ గణపతి మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ మోటారు మెకానిక్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ, గాట్లిబ్ డైమ్లర్ 1885లో టూ వీలర్‌ను కనిపెట్టారని, ఆయనను స్మరించుకుంటూ ప్రతి ఏడాది బైక్ మెకానిక్స్ డేగా జరుపుతున్నామన్నారు. మెకానిక్‌లంతా యూనియన్ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



అంబాజీపేట: కొత్త డిప్యూటీ ఎంపీడీఓగా కె.శ్రీనివాస్ గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డీఎల్పీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ, పదోన్నతి బదిలీపై డిప్యూటీ ఎంపీడీఓగా ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, మండలాభివృద్ధికి, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమిస్తానన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ధర్నా

రావులపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏపీపీటీడీ యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ నెల 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని సంఘ నాయకులు కోరారు. సంఘ డిపో కార్యదర్శి ఏఎస్ నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ, రాత్రి షిఫ్టులో మహిళలను పనిచేయడానికి క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పారిశ్రామిక సంబంధాల చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జి శ్రీనివాస్, నాయకులు జ్యోతికుమారి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

టెండర్లకు ఆహ్వానం

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లాలోని ఆర్టీసీ బస్ స్టేషన్‌లోఉన్న ఖాళీ స్థలాలకు ఓఎస్ 15 ప్రాతిపదికన టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు కోనసీమ జిల్లా రీజినల్ మేనేజర్ ఎస్టీపీ రాఘవకుమార్ తెలిపారు. మండపేట 726 చదరపు అడుగులు, అంబాజీపేట 9,148 చదరపు అడుగులకు టెండర్ల ప్రీ-బిడ్ సమావేశం ఈ నెల 8న ఉదయం 11.30కు రాజమహేంద్రవరంలో జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కార్యాలయంలో జరుగుతుందన్నారు.

అప్పడప్పడిలా..!

- కార్పొరేషన్ రుణాల కోసం అభ్యర్థుల ఎదురుచూపులు
- ఆర్భాటంగా ప్రకటించి.. తుస్సు మనిపించిన కూటమి ప్రభుత్వం
- ఇంటర్వ్యూలు ముగిసి మూడు నెలలైనా అందని రుణం



అంబాజీపేటలో కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

అంబాజీపేట: తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ సబ్సిడీ రుణాలను ఇస్తామని వాగ్దానం చేసిన కూటమి పార్టీలు.. తీరా అధికారం చేపట్టాక నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారు. ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేసి.. సబ్సిడీ రుణాల కోసం వందలాది మంది అభ్యర్థులకు నిర్వహించిన ఇంటర్వ్యూలు హుళక్కేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రచార ఆర్భాటమే మినహా కూటమి ప్రభుత్వ వాగ్దానం అమలుకు నోచుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా.. నేటికీ ఏ పథకమూ సక్రమంగా అమలు చేయలేదని బహిరంగంగా ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర కార్పొరేషన్ల రుణాల మంజూరు పేరుతో హడావుడి చేశారు మినహా, ఎక్కడా కార్యరూపం దాల్చలేదు. దీంతో కేవలం గొప్పల కోసమే ఇదంతా చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏ ఒక్కరికీ లేదు

రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో ఈ ఏడాది ఏప్రిల్ మూడో తేదీన మండల ప్రజా పరిషత్ కార్యాలయాల వద్ద అధికారులు, బ్యాంకు మేనేజర్లు కలిసి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నేటి వరకూ ఏ ఒక్కరికీ రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవని నిరుద్యోగులు చెబుతున్నారు. అంబాజీపేట మండలంలో 16 గ్రామాలకు సంబంధించి ఐదు బ్యాంకుల పరిధిలో 89 యూనిట్లు మంజూరు కాగా, 1,397 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కొక్క యూనిట్ విలువ రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షలుగా నిర్ణయించారు. బ్యాంకర్ల వాటా సగం, ప్రభుత్వ సబ్సిడీ వాటా సగం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు.

సబ్సిడీ జమైతే కానీ..

యూనిట్ల మంజూరు కేటాయింపులు తక్కువగా ఉండటంతో, ఇంటర్వ్యూలు నిర్వహించకుండానే కూటమి ప్రభుత్వం ఈ ప్రక్రియను నిలిపివేసింది. కూటమి ప్రభుత్వ పెద్దల సిఫార్సులు ఉన్న వారికే రుణాలు ఇస్తారన్న కారణంగా కొందరు అభ్యర్థులు ఆశలు వదులుకున్నారు. మరి కొందరు ఇంటర్వ్యూలు ముగిసినప్పటి నుంచి సబ్సిడీ రుణాలు ఎప్పుడు వస్తాయా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇలాఉండగా బీసీ, ఓసీ కార్పొరేషన్ ఇంటర్వ్యూల ప్రక్రియ ముగిసిన తర్వాత కొద్ది రోజులకే అర్హుల జాబితా సిద్ధం చేసి మండల ప్రజా పరిషత్ సిబ్బంది బ్యాంకర్లకు పంపించారు. లబ్ధిదారుల ఖాతాలో సబ్సిడీ జమ అయితే కానీ రుణాలు మంజూరు చేయని పరిస్థితిలో బ్యాంకర్లు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో మూడు నెలలుగా లబ్ధిదారులు బ్యాంకులు, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో కార్పొరేషన్ రుణాలు మంజూరు కేవలం బూటకమని, నిరుద్యోగులను మోసం చేశారని అనేక మంది అభ్యర్థులు మండిపడుతున్నారు.

బ్యాంకులకు పంపించాం

కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు ముగిసిన వెంటనే అర్హుల జాబితాను సిద్ధం చేశామని మండల ప్రజా పరిషత్ అధికారులు తెలిపారు. అన్ని బ్యాంకులకు జాబితాను పంపించి తమ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. రుణాలు మంజూరు చేయాల్సిన బాధ్యత బాంకర్లపై ఉందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం లబ్ధిదారులకు సబ్సిడీపై రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటారని అధికారులు చెబుతున్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.12 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ వివరాలను సంస్థ ప్రతినిధులు గురువారం ఇక్కడ వెల్లడించారు. అనపర్తికి చెందిన 50 ఏళ్ల మండ శ్రీదేవికి మధుమేహం పెరగడంతో మోకాలి కింది వరకు వైద్యులు ఓ కాలు తొలగించారు. రోజువారీ వైద్యానికి, మందులకు చాలా ఖర్చవుతోంది. అద్దె ఇంట్లో ఉంటున్న ఆమె చాలా ఇబ్బందులు పడుతున్నారు. రైస్ మిల్లులో పని చేసే ఆమె భర్తకు ఆర్థికస్థోమత లేకపోవడంతో, కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యుల సాయం కోరారు. దీంతో గురువారం అనపర్తిలో శ్రీదేవి ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు ఈ ఆర్థిక సాయం అందించారు.

సొసైటీ భూములను పరిశీలించిన ఆర్డీఓ



పెదపట్నంలంకలో సొసైటీ భూముల రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవి

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామంలోని లంకపేటలో ఉన్న సొసైటీ భూములను అమలాపురం ఆర్డీఓ కె.మాధవి గురువారం పరిశీలించారు. 6.50 ఎకరాల భూమిని గతంలో ఇళ్ల పట్టాలుగా ఇచ్చేందుకు ప్రతిపాదనలు చేశారు. దీనిపై సొసైటీ సభ్యులు కోర్టును ఆశ్రయించారు. ఎంతో కాలం నుంచి ఈ భూములను తాము సాగు చేసుకుంటున్నామంటూ సొసైటీ ప్రతినిధులు కోర్టును ఆశ్రయించగా, ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టులో పెండింగ్‌లో ఉంది. కోర్టు వివాదంలో ఉన్న భూములను ఆర్డీఓ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. దీంతో పాటు గోదావరి వరద పరిస్థితిపై కూడా ఆమె సమీక్షించారు. పాశర్లపూడి గ్రామంలోని వాడబోది మీడియం డ్రెయిన్ నుంచి వస్తున్న ఉప్పు నీరు, ముంపు నీటి ప్రభావంతో కొబ్బరి చెట్లు పాడైపోతున్నాయని, వరి చేలు ముంపు బారిన పడుతున్నాయంటూ స్థానిక రైతులు చేసిన ఫిర్యాదు మేరకు ఈ ప్రాంతాన్ని ఆర్డీఓ పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ పి.సునీల్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శరణ్య, ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్వోలు, వీఆర్ఏలు ఉన్నారు.

10న మెగా పేరెంట్స్ డే

డీఈఓ సలీమ్ బాషా



విద్యార్థులకు క్లాసు చెబుతున్న డీఈఓ బాషా

మామిడికుదురు: మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నట్టు డీఈఓ షేక్ సలీమ్ బాషా తెలిపారు. ఆయన గురువారం నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు, ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు క్లాస్ చెప్పారు. వారి నుంచి పలు వివరాలు తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో చిన్నారులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజన పథకంలో తయారు చేసిన వంటలను పరిశీలించి, అక్కడే భోజనం చేశారు. విద్యార్థి మిత్ర కిట్లలో పంపిణీ చేసే క్లాత్‌ను పరిశీలించారు. మెగా పేరెంట్స్ డే సమావేశానికి ప్రతి విద్యార్థి యూనిఫారంతో వచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. ఆయన వెంట హెచ్ఎంలు పి.సోమశేఖరరావు, బావిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు ఐరన్ సిరప్ అందజేత

ఆలమూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ డ్రాప్స్ అందజేశారు. ఎనిమియా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు వెళ్లి, ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ డ్రాప్స్ అందించారు. ప్రతి గురువారం ఈ డ్రాప్స్ అందిస్తారని వైద్యాధికారులు తెలిపారు.

బీఆర్వో రిటైర్డ్ హవల్దార్‌కు ఘన సన్మానం

మామిడికుదురు: ఇండియన్ ఆర్మీకి అనుబంధ సంస్థ అయిన బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ (బీఆర్వో)లో హవల్దార్‌గా పని చేసి, గత నెల ఉద్యోగ విరమణ పొందిన కొప్పిశెట్టి వెంకట సత్యనారాయణ, నాగలక్ష్మి దంపతులను గురువారం స్వగ్రామమైన మామిడికుదురులోని కంచివారిపాలెంలో ఘనంగా సత్కరించారు. పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో సత్యనారాయణ విధులు నిర్వహించారు. శ్రీకోదండ రామాలయం, సూర్యతేజ యువజన సంఘ ప్రతినిధులతో పాటు, గ్రామస్తులు కలిసి సత్యనారాయణ, నాగలక్ష్మి దంపతులను భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అనంతరం ఘనంగా సన్మానించారు. నాలుగు దశాబ్దాల పాటు సైన్యానికి విశేష సేవలందించారని వక్తలు కొనియాడారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖులు కంచి సత్యనారాయణ, కంచి మోహన్‌గాంధీ, కంచి పెంటయ్య, కంచి అప్పారావు, కంచి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

బాధితుడి వైద్యానికి ఆర్థిక సాయం



కొత్తపేటలో బాధితుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న శిల్పి రాజ్‌కుమార్

కొత్తపేట: అనారోగ్యంతో బాధ పడుతున్న వ్యక్తి వైద్యానికి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. వాడపాలెం గ్రామానికి చెందిన సంఘ సభ్యుడు అమలాపురపు వీరభద్రం కాలేయ సంబంధ వ్యాధితో బాధ పడుతున్నాడు. ఇప్పటికే అనేక ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నాడు. మెరుగైన వైద్యానికి రూ.లక్షల వ్యయం ఖర్చవుతుందని వైద్యులు పేర్కొన్నారు. పేద కుటుంబానికి చెందిన వీరభద్రానికి అంత ఆర్థిక స్తోమత లేకపోవడంతో సంఘాన్ని ఆశ్రయించారు. సంఘ సభ్యులతో పాటు, ప్రముఖ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్ వుడయార్ ఆర్థిక సాయంతో రూ.65 వేలు సమకూర్చారు. ఆ మొత్తాన్ని గురువారం శ్రీనాథరత్న శిల్పి వుడయార్ సాంస్కృతిక సేవా సంస్థ కార్యాలయంలో బాధితుని కుటుంబ సభ్యులకు శిల్పి రాజ్‌కుమార్ వుడయార్ అందజేశారు. సంఘ సభ్యులు మంతెన సాయిబాబు పాల్గొన్నారు.

బీజామృతం రైతులకు వరం



మాకనపాలెంలో బీజామృతంతో విత్తన శుద్ధి చేస్తున్న మహిళలు

మామిడికుదురు: రైతులకు బీజామృతం వరం లాంటిదని ప్రకృతి వ్యవసాయం ఈదరాడ యూనిట్ ఇన్‌చార్జి కుడుపూడి జానకి తెలిపారు. మాకనపాలెంలో గురువారం బీజామృతం తయారీ, బీజామృతంతో విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. వంద లీటర్ల నీటిలో తాజా ఆవుపేడను గుడ్డలో మూట కట్టి, కర్ర సహాయంతో నీటిలో వేలాడదీయాలన్నారు. 12 గంటల తర్వాత మూటలో ఉన్న పేడను గట్టిగా పిసికి ద్రావణం తీయాలని సూచించారు. అనంతరం ఈ ద్రావణంలో ఐదు లీటర్ల ఆవు మూత్రం, నానబెట్టిన 25 గ్రాముల సున్నాన్ని కలపి బీజామృతం తయారు చేసుకోవాలన్నారు. విత్తేందుకు సిద్ధం చేసిన విత్తనాలపై ఈ మిశ్రమాన్ని చల్లాలని తెలిపారు. విత్తనాలకు బీజామృతం అంటేలా చూడాలన్నారు. విత్తనశుద్ధి అనంతరం అరగంట నీడలో ఆరబెట్టి విత్తుకోవాలన్నారు. దీనివల్ల మొలక శాతం పెరుగుతుందని, భూమి ద్వారా, విత్తనం ద్వారా పంటలకు సంక్రమించే తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. విత్తన శుద్ధి చేసిన నారుమళ్లలో మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయన్నారు. మాకనపాలెం ఏపీఆర్‌టీ గోగి లెనిల్, రైతులు నయనాల శ్రీరంగనాథం, మొల్లేటి చక్రపాణి, మొల్లేటి రామారావు, చెల్లింగి వెంకటేశ్వరరావు, చెల్లింగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణకర్త గంగారావు మృతి



సిద్ధంశెట్టి గంగారావు (ఫైల్)

కొత్తపేట: ఏనుగుల మహల్ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయ నిర్మాణకర్త సిద్ధంశెట్టి గంగారావు(88) మృతి చెందారు. స్వగ్రామమైన మందపల్లిలో బుధవారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు. భూస్వామి అయిన గంగారావుకు నలుగురు కుమారులు ఉన్నారు. ఆయన వేంకటేశ్వరస్వామిపై భక్తితో 2003లో మందపల్లి వంతెన సమీపంలో ముక్తేశ్వరం కాలువకు చేర్చి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. అదే ఆలయ ప్రాంగణంలో అయ్యప్పస్వామి ఆలయాన్ని కూడా నిర్మించారు. ఆలయ పోషకులుగా వ్యవహరిస్తూ, వివిధ పర్వదినాలకు ప్రత్యేక పూజలు, ఉత్సవాలు, స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆయన మృతికి పలువురు నాయకులు, మందపల్లి, ఏనుగుల మహల్ గ్రామాల ప్రజలు సంతాపం ప్రకటించారు.

సమన్వయ లోపం.. రైతులకు శాపం

- ఇరిగేషన్, డ్రెయిన్స్ శాఖలకు కొరవడిన ముందుచూపు
- ముంపునకు గురైన నారుమడులు



మెర్లపాలెంలో ముంపునకు గురైన వరి చేను

కొత్తపేట: కూటమి ప్రభుత్వం, ఇరిగేషన్, డ్రెయిన్స్ శాఖలకు ముందుచూపు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బొబ్బర్లంక-ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువ నీటిమట్టం పెరగడంతో ఆత్రేయపురం మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటకు సంబంధించి నారుమడులు, నాట్లు వేసిన చేలు ముంపునకు గురయ్యాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇరిగేషన్, డ్రెయిన్స్ శాఖల సమన్వయ లోపమే కారణమని పలువురు రైతులు వాపోయారు. బ్యాంక్ కెనాల్‌కు చేపట్టిన అండర్ టెన్ సైఫన్ నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. ఖరీఫ్‌కు సిద్ధమైన రైతులు ఆకుమడులు పూర్తి చేసి, నాట్లు ప్రారంభించారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ నీటితో పాటు, ముక్తేశ్వరం కెనాల్‌కు హైలెవెల్ నీటిమట్టం కట్టి, నీరు విడుదల చేయడంతో సుమారు 200 ఎకరాల్లో పొలాలు ముంపు బారిన పడ్డాయి. ప్రధానంగా మెర్లపాలెం వాడపల్లి ఆలయానికి వెళ్లే దారిలో బ్యాంకు కాలువపై నిర్మించిన వంతెనకు సమీపంలో సుమారు 100 ఎకరాలు, ఆత్రేయపురం లొల్ల లాకులకు దిగువన సుమారు 100 ఎకరాలు నీట మునిగాయి.

పాడవుతాయని ఆందోళన

నారుమడులు నీట మునగడంతో సకాలంలో నీరు దిగకపోతే పాడైపోతాయని, మరలా నారుమడులు వేయాలంటే పంటకు సమయం చాలదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందుచూపు లేకుండా సైఫన్ పనులు చేపట్టి, సకాలంలో పూర్తి చేయకపోవడంతో సాగునీటి సరఫరాలో తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు నీరు వదిలినా, ఇప్పుడు నీటి మట్టం పెంచి సాగునీరు సరఫరా చేయడంతో చేలు, నారుమడులు ముంపునకు గురయ్యాయి. దీనిపై ఇరిగేషన్ ఏఈ వి.మాధవను వివరణ కోరగా, ముక్తేశ్వరం కింది భూములకు అవసరమైన నీరు అందించడం కోసం ఇక్కడ నీటి మట్టం పెంచాల్సి వచ్చిందన్నారు. మూడేళ్లకు ఓసారి కాలువలో పూడికలు తొలగించాల్సి ఉందన్నారు. పూడిక తీయకపోవడంతో నీటిమట్టం పెరుగుతుందన్నారు. డ్రెయిన్స్ ఏఈ జయలక్ష్మిని వివరణ కోరగా, కాలువ నీరు, వర్షం నీరు డీపీ ద్వారా చేలల్లోకి ఎక్కడంతో ముంపునకు గురయ్యాయన్నారు. సైఫన్ పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తి చేసి కనెక్షన్ ఇవ్వాల్సివుందన్నారు. లొల్ల, వాడపల్లి డ్రెయిన్లు తవ్వాల్సి ఉందని తెలిపారు.

వరదల సమయాల్లో అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

పి.గన్నవరం: లంక గ్రామాల ప్రజలు వరదల సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పి.శ్రీపల్లవి అన్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల్లో గురువారం ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ భూపేంద్ర సింగ్‌తో కలిసి వరద జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు. వరదల సీజన్‌లో పడవలపై రాకపోకలు, వైద్యపరంగా అత్యవసరమైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెన్నపు వర్మ, వీఆర్వోలు కె.భగవాన్, సూర్యనారాయణ, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది వి.శ్రీనివాస్‌రావు, గొల్లపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒంపు.. ముప్పు

- అపాయకరంగా టేకిశెట్టిపాలెం-అంతర్వేది రోడ్డు
- చానల్, చెరువు మధ్యగా రహదారి
- విస్తరణ చేపట్టాలంటున్న జనం



అంతర్వేదిపాలెంలో చానల్, చెరువు మధ్య ఇరుకుగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెంలో వైష్ణవ కొట్లుకు సమీపంలో ఓవైపు అంతర్వేది చానల్, మరోవైపు చాకలి చెరువుకు మధ్య ఇరుకుగా ఒంపులతో, తక్కువ వెడల్పుతో ఉన్న ఆర్అండ్‌బీ రహదారి అపాయకరంగా ఉంది. ఇటు చానల్‌కు, అటు చెరువుకు మధ్యలో సుమారు 800 మీటర్ల మేర ఉన్న ఈ రోడ్డుపై ప్రమాదకర పరిస్థితులు నెలకొనడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ వెడల్పు ఉన్న రోడ్డుకు తగ్గట్టుగా ఎడ్జి కూడా సరిపడా లేకపోవడంతో, ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనాలు అదుపు తప్పి చానల్‌లోకి లేదా చెరువులోకి దూసుకెళ్లే అవకాశం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ రోడ్డును విస్తరణ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అంతర్వేదికి వెళ్లే మార్గం

టేకిశెట్టిపాలెం మెయిన్ రోడ్డు నుంచి అంతర్వేదికి వెళ్లే ఈ ఆర్అండ్‌బీ రోడ్డుకు అంతర్వేదిపాలెం పరిధిలో ఎస్ ఆకారంలోని మలుపు ఉంది. రోడ్డుకు రెండు ఒంపుల్లో ఎదురెదురుగా తారసపడే లోడ్, అన్‌లోడ్ వాహనాలు తప్పుకొనే క్రమంలో అదుపుతప్పి చెరువులో కానీ, పంట కాలువలో కానీ పడిపోయే ప్రమాదం ఉందంటున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదాలు

గతంలో ఇక్కడ రెండు పర్యాయాలు వాహనాలకు త్రుటిలో ప్రమాదాల నుంచి తప్పించుకున్న ఘటనలు ఉన్నాయి. డ్రైవర్లు చాకచక్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదాలు తప్పాయని స్థానికులు తెలిపారు. వీటితో పాటు ఒక ఒంపు వద్ద చానల్ వైపు రోడ్డు మార్జిన్‌లో ఉన్న విద్యుత్ స్తంభం కూడా వాహనాలకు ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు అంటున్నారు.

ప్రతిపాదనలు పంపిస్తున్నాం

వైష్ణవ కొట్లు సమీపంలో చెరువు, పంట కాలువ మధ్యగా వెళుతున్న రోడ్డుకు సంబంధించి విస్తరణ పనులకు ప్రతిపాదనలు పంపిస్తున్నాం. టేకిశెట్టిపాలెం నుంచి అంతర్వేది వరకున్న ఈ రోడ్డుకు, శృంగవరప్పాడు నుంచి అంతర్వేది వరకూ విస్తరణ పనులు ఇప్పటికే పూర్తి చేశాం. శృంగవరప్పాడు నుంచి టేకిశెట్టిపాలెం వరకూ మిగిలి ఉన్న 3.4 కి.మీ. మేర రోడ్డు విస్తరణకు రూ.9.20 కోట్లకు ప్రతిపాదించాం.

– సురేష్, జేఈ, ఆర్అండ్‌బీ, రాజోలు

ఇరుకు రోడ్డు వెడల్పు చేయాలి



వైష్ణవ కొట్లు సమీపంలో ఉన్న ఇరుకు రోడ్డును మరింత వెడల్పు చేయాలి. ఈ రోడ్డుపై వాహనాలు తప్పుకొనే క్రమంలో అదుపు తప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది.

– గెద్దం బాలరాజు, శృంగవరప్పాడు

త్వరితగతిన పనులు చేపట్టాలి



పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలి. వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డుకు ఓవైపు చానల్, మరోవైపు చెరువు ఉన్నాయి.

– తోట జాన్‌బాబు, అంతర్వేదిపాలెం